అండర్ గ్రౌండ్ డ్రెయిన్‌కు గ్రీన్ సిగ్నల్

- తొలిదశ పనుల ప్రారంభానికి సన్నాహాలు
- రూ.87 కోట్ల పనులకు ఆర్థిక శాఖ అనుమతులు

నరసాపురం: నరసాపురం మున్సిపాలిటీలో అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ సిస్టం ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ వచ్చింది. ఈ ప్రాజెక్టు కోసం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.220 కోట్లు మంజూరు చేసిన సంగతి తెలిసిందే. ఈ భారీ ప్రాజెక్ట్‌కు సంబంధించి రూ.87 కోట్లతో మొదటి దశలో పనులు ప్రారంభించడానికి ప్రభుత్వ ఛీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మొదటి దశలో 1 నుంచి 9 వరకూ వార్డుల్లో పనులు మొదలు పెట్టేలా టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. దీంతో అంచనాలు, పనుల ప్రణాళికలు తయారు చేసే పనిలో మున్సిపల్ అధికారులు పడ్డారు. అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ వ్యవస్థతో పట్టణంలో అస్తవ్యస్తంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థకు మోక్షం కలగనుంది. అందువల్ల నరసాపురం పట్టణంలో అండర్ గ్రౌండ్ నిర్మాణానికి సంబంధించిన తొలిదశ పనులకు రూ.87 కోట్లు మంజూరు చేస్తూ ఆర్థిక శాఖ అనుమతులు కూడా ఇచ్చింది. దీంతో రాబోయే 50 ఏళ్ల వరకూ ఇక పట్టణంలో డ్రెయినేజీ ఇబ్బందులు ఉండని విధంగా అండర్ డ్రెయినేజీ వ్యవస్థ నిర్మాణానికి రూపకల్పన చేశారు.


పట్టణంలోని రాయిపేటలో అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ

డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

పట్టణం డ్రెయినేజీ వ్యవస్థ క్షీణదశకు చేరుకుంది. గత టీడీపీ హయాంలో ప్రణాళికాబద్ధంగా డ్రెయినేజీ నిర్మించకపోవడం, పనుల్లో నాణ్యతా లోపాలు పరిస్థితిని మరింత దిగజార్చాయి. మొత్తానికి డ్రెయినేజీ వ్యవస్థపై ఇప్పటి వరకూ ఖర్చు చేస్తూ వచ్చిన ప్రజాధనం అంతా వృథా అన్నట్లుగా పట్టణంలో ఏ డ్రెయినేజీను చూసినా అర్థమవుతోంది. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ ప్రక్షాళనకు భారీ ప్రాజెక్ట్ మంజూరవుతుందని గత పాలకులు ఎన్నో ఏళ్ల నుంచి హామీలు గుప్పిస్తూ వచ్చారు. కానీ ప్రత్యేక ప్రాజెక్ట్ సంగతి అటుంచి ప్రస్తుతం ఉన్న డ్రెయినేజీలు సవ్యంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత పాలకుల హయాంలో నిర్మించిన కొద్దిపాటి డ్రెయిన్స్ కూడా ప్రణాళికా బద్ధంగా లేకపోవడం అవి నిరుపయోగంగా మారాయి. నాణ్యతా లోపాలతో చాలా డ్రెయిన్స్ శిథిలమయ్యాయి.

పట్టణంలో బస్టాండ్ సెంటర్, మాధవాయిపాలెం, రాయిపేట, రుస్తుంబాద ప్రాంతాల్లో ప్రధాన డ్రెయినేజీలున్నాయి. వార్డులోని పలు వీధుల్లో ఉన్న ఉప డ్రెయిన్లన్నీ ఈ ప్రధాన డ్రెయినేజీల్లో కలుస్తాయి. ఇక డ్రెయినేజీలు అధ్వానంగా ఉండడంతో వర్షం వస్తే బస్టాండ్ ఏరియా, పొన్నపల్లి, నందమూరి కాలనీ, వైఎస్సార్ నగర్ ప్రాంతాలు వర్షంనీరు పారక నీట మునుగుతున్నాయి. అలాగే 21, 22, 23, 24, 25, 26, 27 వార్డులు, పొన్నపల్లి, మాధవాయిపాలెం, స్టేషన్ పేట ప్రాంతాల్లో మైనర్ డ్రెయిన్స్ శిథిలమయ్యాయి. అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్ట్‌తో మొత్తం డ్రెయినేజీ వ్యవస్థ సమస్యకు చెక్ పడనుంది.

యాభై ఏళ్ల పాటు సమస్య లేకుండా నిర్మాణం



పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అధ్వానంగా తయారైంది. లెవిల్స్ ఎక్కడా సరిగాలేవు. ఏదో ఒక నిధులతో కట్టేశాం అన్నట్లుగా డ్రెయినేజీలు గతంలో కట్టేశారు. దీంతో కొద్దిపాటి వర్షం వస్తే డ్రెయినేజీల్లో నీరంతా రోడ్లమీదే ఉంటుంది. అందువల్ల రూ.220 కోట్లు అంచనాలతో రూపొందించి అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ ప్రాజెక్ట్‌కు సీఎం ఓకే చెప్పడం, మొదటి దశలో రూ.87 కోట్ల పనులకు ఆర్థిక శాఖ అనుమతులు ఇచ్చింది. త్వరలోనే మొదటి దశ పనులు చేపట్టడానికి చర్యలు తీసుకుంటున్నాం.

– ముదునూరి ప్రసాదరాజు, ప్రభుత్వ చీఫ్ విప్

తణుకు చేరిన వేంకటేశ్వర వైభవ యాత్ర

తణుకు అర్బన్: యాదాద్రి వెంకన్న స్వామి తిరుమల నుంచి వేంకటేశ్వర వైభవయాత్ర పేరుతో నిర్వహిస్తున్న రథయాత్ర శుక్రవారం సాయంత్రం తణుకు చేరుకుంది. స్థానిక వాసవి క్లబ్ రాయల్స్, వాసవి వనిత క్లబ్ ప్రతినిధులు స్వామివారి రథానికి సాంప్రదాయ పద్ధతిలో స్వాగతం పలికారు. తణుకు పట్టణంలోకి ప్రవేశించిన సమయం నుంచి రథంతోపాటు క్లబ్ మహిళలు కోలాట భజన చేస్తూ శ్రీవారి సంకీర్తన చేశారు. సెప్టెంబరు 25వ తేదీన తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి ప్రారంభించిన ఈ రథయాత్ర ఆంధ్రప్రదేశ్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయాలన్నింటికీ వెళ్తూ 100 రోజుల యాత్రలో భాగంగా తిరిగి తిరుపతి చేరుకుంటుందని, వెంకటేశ్వరస్వామి ఆలయాలన్నిటినీ అనుసంధానం చేస్తూ ఒకే తాటిపైకి తీసుకురావడమే తమ ధ్యేయమని రథయాత్ర నిర్వాహకులు వివరించారు. పారిశ్రామికవేత్త గమిని రాజా అధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, అఖిలభారత బ్రాహ్మణ యువత ఉపాధ్యక్షుడు నూరంపూడి కామేష్, స్వప్న సుబ్బారావు, వాసవి క్లబ్ రాయల్స్ అధ్యక్షుడు జవ్వాది వీరభద్రయ్య, కోశాధికారి కట్టమూరి మురళి, క్లబ్ వ్యవస్థాపకులు జల్లూరి జగదీష్, వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు ఆకుల వీరకుమారి, కోశాధికారి జల్లూరి సుజాత, పీఆర్వో పాలోలు కృష్ణ, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అనాథ పిల్లలకు పౌష్టికాహారం అందజేత


మానవత స్వచ్ఛంద సంస్థ అధ్వర్యంలో అనాథ పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం కొత్తపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో అనాథ పిల్లలకు పౌష్టికాహారం అందజేశారు. ఎల్ఐసీ అధికారి బొప్పన నాగమల్లేశ్వరరావు విరాళంతో అనాథ పిల్లలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మానవత పాలకొల్లు శాఖ అధ్యక్షుడు ముత్యాల శ్రీనివాస్, డైరెక్టర్ బోర్డు కన్వీనర్ ముత్యాల రామారావు, కార్యదర్శి డా.పీఎస్ ప్రతాప్‌రాజు, ఉపాధ్యక్షుడు ధనాని సూర్యప్రకాష్, ఐ.శివరాంగోపాల్, బొక్కా రమాకాంత్ పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి


27వ వార్డులో కార్యకర్తలు, మహిళలతో చందక సత్తిబాబు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లులో ఈ నెల 8న నిర్వహించే సామాజిక సాధికారిక బస్సు యాత్రను విజయవంతం చేయాలని పట్టణ పార్టీ అధ్యక్షుడు చందక సత్తిబాబు కోరారు. పట్టణంలోని 12వ సచివాలయ పరిధిలోని 27వ వార్డులో శుక్రవారం పార్టీ నాయకులు, మహిళలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వార్డు ఇన్‌చార్జ్ ఉప్పె పండుబాబు, పార్టీ నాయకులు బంగారు రాజు, ఎస్‌వీఎస మాధు సుధాకరరావు, కలిగిది వరప్రసాద్, ఎస్‌వీఎస్ ప్రసాద్, సీఆర్‌పీ కె.శంకుతల తదితరులు పాల్గొన్నారు.

శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరణ


శాంతి సద్భావన యాత్ర పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ పెద్ద, సర్పంచ్ శ్యామల

పెనుగొండ: 100 శతక పుస్తకాలు రచించిన చిగురుమళ్ల శ్రీనివాస్ వందే విశ్వమాతరమ్ పేరుతో 100 దేశాలలో శాంతి, సద్భావనయాత్ర పోస్టర్‌ను పశ్చిమ గోదావరి జిల్లా తానా కో ఆర్డినేటర్ డాక్టర్ బాల చందర్ సాదే ఆధ్వర్యంలో పెనుగొండ ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఆవిష్కరించారు. పోస్టర్‌ను ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), సర్పంచ్ నక్కా శ్యామలా సోనీలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస్ దొర, ఎస్‌వీకేపీ కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు, ప్రిన్సిపాల్ కేవీఆర్ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎన్నికల స్పెషల్ క్యాంపులు

పాలకొల్లు అర్బన్: కొత్త ఓటర్ల నమోదుకు శనివారం, ఆదివారం, అలాగే డిసెంబర్ 2, 3 తేదీల్లో నియోజకవర్గంలోని అన్ని బూత్‌ల వద్ద స్పెషల్ ఎన్నికల క్యాంపులు నిర్వహిస్తున్నామని పాలకొల్లు అసెంబ్లీ నియోజకవర్గ ఈఆర్వో కేసీహెచ్ అప్పారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా బూత్‌ల వద్ద బూత్ లెవెల్ అధికారులు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. కొత్త ఓటర్ల నమోదు, అలాగే ఓటర్ల తొలగింపు, మార్పులు, చేర్పులకు సంబంధించి ఫారం 6,7,8 దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. ఓటర్లంతా ఆయా పోలింగ్ కేంద్రాల వద్దకు వెళ్లి ఓటర్ల ముసాయిదా జాబితాలో తమ పేరును పరిశీలించుకోవచ్చని అప్పారావు సూచించారు.

గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన


విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తున్న ఎస్సై జయశ్రీ

సాక్షి, భీమవరం: విద్యార్థినులు పరిచయం లేని వ్యక్తులతో మాట్లాడడం అంతగా మంచిది కాదని ప్రతి విద్యార్థిని గుడ్ టచ్, బ్యాడ్ టచ్ అవగాహన కలిగి ఉండాలని భీమవరం దిశ పోలీసుస్టేషన్ ఎస్సై జయశ్రీ అన్నారు. శుక్రవారం డాడేరు రోడ్‌లోని ఇందిరగాంధీ మునిసిపల్ స్కూల్ విద్యార్థులు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. విద్యార్థులకు ఏదైనా ఆపద వస్తే దిశా కాల్ సెంటర్ నెంబర్ 112 ఉపయోగించుకోవాలని సూచించారు. ఫోన్ వచ్చిన కేవలం ఐదు నిమిషాల్లోనే బాధితులకు పోలీసు సహాయం అందిస్తారన్నారు.

నెలమూరులో ఆక్వాసాగుపై విచారణ

పెనుమంట్ర: ఆక్వా సాగువల్ల సాగునీటి సమస్యలు ఎదురుకాకుండా పరిష్కార మార్గాలను చూపిస్తామని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్ వెంకటేశ్వరరావు అన్నారు. నెలమూరులో ఆక్వా కల్చర్‌పై వస్తున్న అభ్యంతరాలపై శుక్రవారం గ్రామంలో జిల్లా అధికారులతో కలిసి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మంగం శివకుమార్, నాగరాజు సుబ్బరాజు, ఎరకరాజు సుబ్బరాజు, కొయ్యే జయశ్రీ, వీరాంజనేయులు, నాగరాజు వెంకటరామరాజు, ఎస్.శివరామకృష్ణ అనే రైతులు ఆక్వా కల్చర్ సాగుపై అభ్యంతరాలు తెలిపిన నేపథ్యంలో గ్రామంలో జిల్లా స్థాయి అధికారి సమక్షంలో విచారణ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను వెల్లడించిన అనంతరం నెలమూరులో 2019 నుంచి ఆక్వా సాగుపై అభ్యంతరాలు వస్తున్నాయని, ఒక బోరు వేసేందుకు రూ. 40 వేలుకు పైగా ఖర్చు అవుతోందని, రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అందరి రైతులతో ఒకే న్యాయం చేయాలని రైతులను వేరు వేరుగా చూడవద్దని ఆక్వా రైతు గొట్టుముక్కల సత్యనారాయణరాజు ఆవేదన వ్యక్తం చేశారు. సాగునీటి ఎద్దడికి ఆక్వాసాగు కారణం కాదని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌వీఎస్ ప్రసాద్ అన్నారు. గ్రామస్తుల సమక్షంలో పలువురు రైతుల సమస్యలకు అధికారులు పరిష్కార మార్గాలు చూపారు. నెలమూరులో వచ్చిన ఫిర్యాదులపై నివేదికను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని జిల్లా అధికారులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ కొచ్చెర్లపాటి మంగతయారు, ఎంపీటీసీ సభ్యురాలు నాగరాజు లక్ష్మి, తహసీల్దార్ అశోక్‌వర్మ, పొల్యూషన్ ప్లానింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్.వెంకటరమణ, మండల వ్యవసాయశాఖ అధికారిణి ఎ.జోశ్యుల, ఫిషరీస్ అసిస్టెంట్ గౌరీ ప్రియ, సెక్రటరీ పి.శేఖర్‌బాబు పాల్గొన్నారు.


ఆక్వాసాగుపై వచ్చిన ఫిర్యాదులపై గ్రామసభలో విచారణ నిర్వహిస్తున్న జిల్లా అధికారులు

వ్యవస్థాపకతతో యువతకు అవకాశాలు

పెనుగొండ: యువతకు వ్యవస్థాపకత వల్ల ఎంతో భవిష్యత్ ఉంటుందని, అవకాశాలు పుష్కలంగా ఉన్న వ్యవస్థను స్థాపించడం ద్వారా ఎన్నో అవకాశాలు పొందవచ్చునని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విశ్రాంత సభ్యుడు డాక్టర్ సుధాకర్ వారణాసి అన్నారు. పెనుగొండ ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో శుక్రవారం భవిష్యత్తుకు మార్గ దర్శకత్వం అంశంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. బయోలాజికల్ సైన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ అవకాశాలను ఉపయోగించుకోవడం వల్ల మార్కెటింగ్, బిజినెస్ అవకాశాలు పై క్షుణ్ణంగా వివరించారు. మెరైన్ బయోపాలిమర్స్ డైరెక్టరు జీఎస్ఎన్ రాజు మాట్లాడుతూ జీవ శాస్త్రం, మెడికల్ ఉత్పత్తులు, నిత్యజీవితంలో వాటి వినియోగం, అవకాశాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు, సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.


పెనుగొండ ఎస్వీకేపీ కళాశాలలో మాట్లాడుతున్న డాక్టర్ సుధాకర్ వారణాసి

తామరాడ సమస్యలకు పరిష్కారం


మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు బొకే ఇస్తున్న తామరాడ గ్రామస్తులు

పెనుగొండ: తామరాడ గ్రామసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు తెలిపారు. శుక్రవారం గ్రామ సమస్యల పరిష్కారం కోసం తామరాడ గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటికే రూ.20లక్షలతో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. గ్రామాన్ని సందర్శించి మరిన్ని పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. సమావేశంలో వైస్ ఎంపీపీ తోలేటి శ్రీనివాస్, సర్పంచ్ మాకినీడి కోట సత్యనారాయణ, పార్టీ ప్రధాన కార్యదర్శి దంపనబోయిన బాబూరావు, ఏఎంసీ డైరక్టరు కుసుమే రాంబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు. అలాగే ఇలపర్రు శ్మశానవాటిక సమస్యపై ఎటువంటి ఆపోహలు వద్దని, పరిశీలించి పరిష్కరిస్తామని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు భరోసా ఇచ్చారు. శుక్రవారం ఇలపర్రు గ్రామస్తులు తూర్పుపాలెంలో కలసిశ్మశాన సమస్యను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు యాండ్ర వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ కేతా భీముడు, ఉప సర్పంచ్ పిల్లి దుర్గారావు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ


పెనుమంట్ర: కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ


పోడూరు: ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ ఇస్తున్న దృశ్యం

పెనుమంట్ర: మండలంలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఈ నెల 2వ వారం నుంచే ధాన్యం కొనుగోలు ప్రక్రియ ప్రారంభమవుతుందని అందుకు వ్యవసాయశాఖ, సహకార సంఘాల సిబ్బంది రైతు భరోసా కేంద్రాల సిబ్బంది సిద్ధంగా ఉండాలని తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ అన్నారు. శుక్రవారం ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి పెనుమంట్ర మండల పరిషత్ కార్యాలయంలో సాంకేతిక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొనుగోళ్లు అన్ని పాత పద్ధతిలోనే కొనసాగుతాయని రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది రైతు భరోసా కేంద్రాల వద్ద తగినన్ని సంచుల నిల్వలు ఉంచుకోవాలన్నారు. నాణ్యతా ప్రమాణాలు సక్రమంగా పాటిస్తూ ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా ధాన్యం కొనుగోళ్లను వేగవంతంగా నిర్వహించాలని రైతులకు ఎలాంటి సమస్య ఎదురైనా స్థానిక అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల సూచనతో కొనుగోళ్లు వేగవంతంగా చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా గతంలో కొనుగోలు కేంద్రాలలో పనిచేయని సిబ్బందికి నాణ్యతా ప్రమాణాల కొలమానాలపై శిక్షణ ఇచ్చారు. కొనుగోళ్లలో సంచులు, వాహనాలు ప్రధానమని వాటి డేటాను ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలన్నారు. టెక్నికల్ అసిస్టెంట్‌నుంచి కస్టోడియన్ వరకు ఎవరి విధులను వారు సక్రమంగా నిర్వహించాలన్నారు. మాయిశ్చర్ 17 శాతం తప్పనిసరిగా ఉండాలన్నారు. మండలంలో 162 వాహనాలు ఉండగా ఇప్పటి వరకు 75 వాహనాలకు మండలంలో ట్యాగ్‌లు వేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కోఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ రెహమాన్, మండల వ్యవసాయశాఖ అధికారిణి అడబాల జోశ్యుల, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ వి.పూర్ణబాల్జీ తదితరులు పాల్గొన్నారు.

పోడూరులో...

పోడూరు: రానున్న ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం సేకరణలో ఎలాంటి లోపాలు లేకుండా కొనుగోలు కేంద్రాల సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని స్థానిక తహసీల్దార్ ఆర్‌వీ కృష్ణారావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఆయన అధ్యక్షతన వీఆర్‌ఓలు, వీపీఏలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ట్రైనీ చంద్రశేఖర్ ధాన్యం నాణ్యత, తేమ శాతం పరిశీలించడం, రైస్‌మిల్లులకు ధాన్యాన్ని చేరవేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జి.సత్యనారాయణ, సీఎస్ డీటీ సత్యనారాయణ, వీఆర్‌ఓలు, వీపీఏలు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వంతులవారీ విధానంతో సమృద్ధిగా సాగునీరు

పోడూరు: పెనుమదం శివారు అల్లంగుంటలో పంటచేలకు వంతులవారీ విధానంలో సాగునీరు సమృద్ధిగా అందుతుందని వైఎస్సార్ సీపీ మండల ఇంఛార్జి పితాని సత్యనారాయణ(చిన్న) అన్నారు. పెనుమదం శివారు అల్లంగుంటలో పంట చేలను శుక్రవారం ఆయనతో పాటు సొసైటీ ఛైర్మన్ కొర్రపాటి వీరాస్వామి, ఇరిగేషన్ ఏఈ ఎస్.శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా మండల ఇంఛార్జి చిన్నా, సొసైటీ ఛైర్మన్ వీరాస్వామిలు మాట్లాడుతూ పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ఇటీవల అల్లంగుంటలో పంట చేలకు నీరందడం లేదంటూ చేలో వాలీబాల్ ఆడి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే నిమ్మల వాస్తవాలు గ్రహించకుండా రాజకీయ ప్రయోజనాల కోసం డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. పలువురు రైతులు గుబ్బల లక్ష్మీనారాయణ, పెచ్చెట్టి రాంబాబు, వెల్లబోయిన రాంబాబు, గెద్దాడ బంగారయ్య, బండి పెద్దిరాజు, కోళ్ల సీతారామయ్య తదితరులు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి ఇటీవల తమ పంట చేలను పరిశీలించారన్నారు. ఆయన ఆదేశాల మేరకు వంతుల వారీ విధానంతో ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది తమ పంటచేలకు సమృద్ధిగా సాగునీరందిస్తున్నారని సంతోషం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జి గోపికి, ఇరిగేషన్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ ఎస్.శ్రీనివాస్, డీఎల్ రామకృష్ణ, సిబ్బంది బంగారు బాబు, మురళి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు గెద్దాడ ఏసు, పాటంశెట్టి నాగరాజు, బొడ్డు బాబి తదితరులు పాల్గొన్నారు.


పెనుమదం శివారు అల్లంగుంటలో సాగునీరు అందుతున్న పంట చేలల్లో రైతులు, నాయకులు

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత

భీమవరం అర్బన్: ఆపదలో ఉన్నవారికి పెద్ద కొడుకులా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటున్నారని సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు తేలి జోషఫ్ రవికుమార్ అన్నారు. భీమవరం మండలంలోని దిరుసుమర్రు గ్రామానికి చెందిన వర్షసపు రాజ్‌కుమార్ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు రొయ్యల కంటైనర్ ఢీకొనడంతో మృతి చెందాడు. డాక్టర్ వైఎస్సార్ జీవిత బీమా ద్వారా రూ. 5 లక్షలు శుక్రవారం ప్రభుత్వం నుంచి విడుదల కావడంతో ఆ చెక్‌ను సర్పంచ్ కోళ్ల బాలకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు తేలి జోషఫ్ రవికుమార్‌లు వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు, వ్యాధుల బారిన పడిన వారికి, ఆసరా కోల్పోయిన వారికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉండి ఆదుకుంటున్నారన్నారు. అంతేకాకుండా కుటుంబంలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందిస్తూ పెద్ద కొడుకులా సమస్యలు తీర్చుతున్నారన్నారు.

మహిళకు గాయాలు

ఆకివీడు: మచిలీపట్నం నుంచి స్థానిక దుంపగడప రోడ్డులోని వినాయక గుడి ప్రాంతంలో నివసిస్తున్న సంచార జాతులకు చెందిన నీలం రంగమ్మను గురువారం రాత్రి ఆటో ఢీకొనడంతో తీవ్ర గాయాలైనట్లు ఎస్సైనాగబాబు శుక్రవారం చెప్పారు. నడిచి వెళ్లుతున్న ఆమెను వెనుక నుంచి అతి వేగంగా, నిర్లక్ష్యంగా ఏపీ 37 టీడీ 6224 నెంబర్ ఉన్న ఢీకొట్టిందని తెలిపారు. ఈ మేరకు ఆమె భర్త నీలం సాంబయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మహిళా బ్యాంకులుగా డ్వాక్రా గ్రూపులు

ఆకివీడు: మహిళా బ్యాంకులుగా డ్వాక్రా సంఘాలు గ్రామాల్లో సేవలందించడం గర్వకారణమని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి, మెప్మా చైర్మన్ మోరా జ్యోతి, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పల్లెం అరుణకుమారి చెప్పారు. స్థానిక క్రాంతి, శ్రీనగర్ కాలనీ స్లమ్ సమాఖ్యల సర్వసభ్య సమావేశం ఆయా ప్రాంతాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ డ్వాక్రా సంఘ సభ్యులు పొదుపు చేసిన సొమ్మును తిరిగి సభ్యులకు రుణాలుగా అందజేయడం అభినందనీయమన్నారు. బ్యాంకుల ద్వారా గతంలో ప్రతీ సభ్యురాలు రూ. 2 వేలు రుణం పొందేవారని, ప్రస్తుత ప్రభుత్వం 3 లక్షలు నుంచి రూ. 5 లక్షల వరకూ రుణం అందజేస్తుందని చెప్పారు. ఒకొక్క గ్రూపు రూ. 50 లక్షల వరకూ రుణాలు పొంది, ఆ సొమ్మును ఇతరుల అవసరాలకు, చిరు వ్యాపారాలకు వినియోగిస్తుండటం ఆనందదాయకమన్నారు. మహిళలు పొదుపును మరింతగా పెంచుకుని రుణసదుపాయాన్ని పెంచుకోవాలన్నారు. ప్రభుత్వం సున్నా వడ్డీ సౌకర్యం కల్పించిందన్నారు. అనంతరం ఆడిట్ వివరాల్ని తెలియజేస్తూ క్రాంతి స్లమ్ సమాఖ్యకు డ్వాక్రా రుణమాఫీ(ఆసరా) ద్వారా రూ.1,43,65,587లు, సున్నా వడ్డీ రూ. 21,47,312లు వచ్చిందని, శ్రీనగర్ కాలనీ సమాఖ్యకు ఆసరా రూ. 1,60,39,194లు, సున్నా వడ్డీ 22,53,419లు వచ్చిందని చెప్పారు. మహిళలు ఆర్థిక స్వావలంబనకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దొడ్డి జగదీష్, వార్డు ఇన్‌చార్జి జోగి నాగరాజు, జేసీఎస్ కన్వీనర్ శిరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


శ్రీనగర్ కాలనీలో డ్వాక్రా సంఘాల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం